# "చెరిగిపోని గతంలోకి"

★

"ధనిష్ట"

"నువ్వెళ్లి ఆ యింట్లో భోషాణం తాళంచెవి వెతికి' ఆ పన్ను పుస్తకమో కాయితాలో వెతికి, రేపు వెళ్లి పన్ను కట్టి రశీదు తీసుకో. అప్పుడే ఒకరోజు అయ్యేపోయింది. ఇంకా పన్లకి నాందే లేదు. నాలుగు రోజులు సెలవుపెట్టి వచ్చిన వాడివి అన్నీ చూసుకోకుండా మన్నుతిన్న పాములా కూర్చుంటే పన్లెలా సాగుతాయ్ ? జాగ్రత్తగా ఆ మున్సబెవడో కనుక్కుమరీ కట్టు—రోజుకోడు మారిపోతున్నాడు. జాగ్రత్తగా చూసుకోకపోతే, కట్టేదీ కట్టి రేపు ఏ జప్తుకో నోటీ సొస్తుంది—ఆ వెంకన్నగాడు కాయ పత్రాలేదు. తోటెల్లా ఉందో చూసిరా. ఆడదాన్ని నే నెక్కడికని దేవుళ్లాడను ? వచ్చాం, వచ్చాం. వెళ్లాం, వెళ్లాం, ఏపనీ కాదు—ఆ యింటి అద్దె వసూలొకటి—సిద్ధాంతిగారింటి కెళ్లి శంఖుస్థాపన ముహూర్తానికి ఏర్పాట్లు—" అమ్మ లిస్టు చదివేస్తోంది.

"అబ్బ, యింక ఆపుతావా ?" విసుగ్గా అన్నాను. లేక పోతే ఇంక ఆ ప్రవాహంలో ఎక్కడ కొట్టుకు పోతానో? అని.

"అంత విసుగైతే ఎల్లాగరా ? చెప్పకపోతే అన్నీ మర్చి పోతావ్ ! ఇంకోసారి జ్ఞాపకంచేస్తే విసుగు—ఇంక చస్తే, ఈ విషయాల్లో కలుగజేసుకుంటే ఒట్టు. చేసుకున్నావో, బాగు పడతావ్—నేనేం కట్టుకుపోతానా ? ఏళ్లు పైబడగానే సరా, బాధ్యత తెలియక్కర్లా ?"

"బ్రహ్మాండంగా చెప్పావమ్మా— ఇంక నువ్వెందులోనూ కల్పించుకోకు."

"కల్పించుకోను, సరా !"

"సరే !"

రెండు నిముషాలు నిశ్శబ్దంగా గడిచాయి.

"ఇంకా ఇక్కడే కూర్చున్నావేంరా ? ఇదేం చోద్య మమ్మా—బెల్లంకొట్టిన రాయిలా—"

పకపక నవ్వు వచ్చింది నాకు.

"సిగ్గులేకపోతే సరి—" తనూ నవ్వుతూ అంది అమ్మ.

నవ్వినా లోపల కోపంగానే ఉందని నాకు తెలియడం వల్లా, ఇంకొక్క క్షణం ఆలస్యంచేస్తే మళ్లీ దండకం మొదలు పెడుతుందనే భయంవల్లా, ఇంకా అక్కడ ఆగకుండా దొడ్డితలుపు తీసుకుని తోటలో పడ్డాను. తోట అవతలి సరి హద్దు అక్కయ్యగారిల్లు.

మామిడిచెట్లు పూత పట్టాయి. నెల్లాళ్లే దింపు తియ్యలేదు కాబోలు, కొబ్బరిచెట్లనిండా గుత్తులుగా వేల్లాడు తున్నాయి కాయలు.

సపోటాచెట్టు, ఉసిరిచెట్టు కొట్టేసినట్టున్నా రీమధ్య.

చిన్నప్పుడు సెలవులు వస్తే చాలు ఎండా, కొండా లేకుండా ఆ చెట్లమీదనే కిష్కింధాపురీ అగ్రహారీకుల్లా విహారం చేసే వాళ్లం.

ఆలోచిస్తూ నాలుగడుగులు వేసి, **instinctive** గా ఆగిపోయాను. ఇంకొక్క అడుగు ముందుకువేస్తే గోతిలో పడేవాణ్ణి. కాలిదారి కిరుప్రక్కలా కొబ్బరిచెట్లు, దున్నిన నేల. అంచేత దారమ్మటే నడవక తప్పదు. దారి పక్కనే తోట మధ్యగా, ఇటికావకోసం పెట్టిన గొయ్యి యింకా పూడ్చ లేదు. అందుకే ఎప్పుడూ జాగ్రత్తగా చూసుకునే నడు స్తుంటాం. ఒకవేళ ఏదో ఆలోచనలలో పడి ఆ విషయం మర్చిపోయినా, చాలాసార్లు పడ్డ జాగ్రత్తవల్ల అనుకోకుండానే ఆగిపోతాం.

వర్షాకాలం చూడాలి వీటి తమాషా. తోటంతా పాదాలు తడిపే నీళ్లుంటాయి. దారి నీళ్లలో ఉంటుంది. అడుగు తడబడితే కంఠదఘ్నమైన గోతిలో పడతాం. సొంత తోటలోంచి వెళ్లడంలో ఉండే ఆనందం, అహం పీడించి, పక్కన పుంత ఉన్నా, ఇందులోంచే వెళ్లడం అలవాటు.

ఇంకోపక్కని రంపం గోతులు. అవీ అలాగే ఉండి పోయాయి, పదేళ్లనించి. పూడిపిద్దామంటే వంద బండి మట్టి యాభై రూపాయలు. వందబండి పది రూపాయ లున్న రోజుల్లో అదే ఎక్కువనిపించి, తగ్గిం తరువాత చూసు కుందామని ఊరుకున్నారు. పది, పదిహేను, అది యిరవై—ఇరవై అయిదు—ఇల్లా పెరుగుతూ వచ్చినకొద్దీ 'అయ్యో ప్రితమే చేయించి ఉండవలసింది' అని నాలిక్కొరుక్కోవడం—

'అయినా యిప్పుడింత ధర పెట్టి ఇది చేస్తే ఎలాగ మీద టికి ఏమైనా పూడ్పించేద్దాం' అనుకుంటూనే సంవత్సరాలు దొర్లిపోయాయి.

ఈఏడు వీటిని పూడ్పించడం మాట అటుంచి, కట్ట బోయే ఇంటికోసం ఇంకా గోతులు పెట్టాలి. ఎప్పటికి కప్పి స్తామో యివి.

కట్టవ అంతటా తాటిచెట్లు ఉన్నాయి. మళ్లీ తీరిక చేసుకుని వచ్చినప్పుడు కొట్టించి వాసాలు కోయించాలి— గుడ్డిలో మెల్ల—అదోటి నయం—అవీ లేకపోతే ఇంకో వెయ్యి ఎక్కువ పుచ్చుకోవాలి.

అక్కయ్యగారింటి దొడ్డితలుపు ఓరగా వేసిఉంది. తోసుకుని లోపలకు వెళ్లి, అద్దెకున్నవారి వాటా పక్కనించి తిరిగి వీథివైపుకి వచ్చి వాళ్లబ్బాయిని పిలిచి తాళంచెవులు అతనికిచ్చి తాళం తియ్యమన్నాను.

జాగ్రత్తకోసం ఇంటికి తాళం వాళ్ల వాటాలోంచి వేస్తాం.

అతను వాళ్ల వంటింట్లోంచి తలుపు తాళం తీసి, బల్లల గాది పక్కనించి అడ్డంగా పీత నడక నడిచి, వెనక వసారా గదిలోంచి హాల్లోకి వచ్చి సింహద్వారం తెరిచాడు.

అన్ని తలుపులు మూసిఉంచడంచేత గాలి ప్రసరించ డానికి వీలులేక, యీ వాటా అంతా గాబు కంపు కొడు తోంది. గబగబ అన్ని తలుపులు తీసి గాలిని చొరబడనిచ్చే దాకా ఊపిరాడలేదు.

హాల్లో ఎడంచేతి పక్క అవతల మూలకి బల్లల గాది, పన్నెండు బస్తాలు పట్టేది. ఇవతల పక్కకి భోషాణం. తలుపు పక్కనే పుస్తకాల బీరువా.

ఇవన్నీ ఉంటుంటే, ఇల్లిల్లా ఉండక శుభ్రంగా ఉండ మంటే ఎల్లా ఉంటుంది. ఇవన్నీ ఇల్లా ఉంటే, 'ఇంటి కెవ ర్నయినా పిలవడానికి సిగ్గుగా ఉంటుంది. సదించవమ్మా—' అంటే 'నోరు ముయ్యరా చెవలమ్మా— లక్ష్మిరా! లక్ష్మి! నాలుగువేళ్లూ నోట్లోకి అవి ఉండబట్టే పోతున్నాయి. అవే లేకపోతే అడుక్కుతిందువు—'' అంటుంది అమ్మ.

అక్కయ్య మహాదేవిగా రెక్కడో పారేసిన భోషాణం తాళంచెవి, ఈ గుహాంతరాళంలో ఎక్కడని వెతికేది ?

ముందర పుస్తకాల బీరువా కదిలించి కింద ఎలుకల వల్ల ఊకగా మార్చబడిన ఒకప్పటి ధాన్యాన్ని, ఊడ్పు తక్కువై పోగుపడిన దుమ్మునీ, ఎప్పుడూ sterile గా అట్టేబెట్టి మృదువుగా వాడుకుంటూ వచ్చిన హస్తద్వయంతో కెలికి తాళంచెవి దొరకకపోగా, చేతులు మాత్రం చక్కటి దుమ్ముతో అలంకృత మయ్యేటప్పటికి, ఒక్క నిట్టూర్పు వచ్చింది.

ఇంతలోకే వీపు దురద పెట్టేటప్పటికి, చేతులకి దుమ్మంటిందనే జ్ఞానం నశించగా, తొందరగా చెయ్యి ఆ పక్కకి పోనిచ్చాను. మల్లెపువ్వులాంటి తెల్ల చొక్కామీద వేలిముద్రలు పడిపోతాయనే ధ్యాస వచ్చేసరికే సమయం మించి పోయింది. కూడదు కూడ దనుకుంటూండగానే జరిగి పోతూంటాయి, యిటువంటి పనులు. చిన్నప్పుడు క్లాసులో మేష్టారు చెప్పేవారు, అసంప్రేరిత ప్రతీకారచర్యని గురించి— అదిప్పుడు అనుభవంలోకి వచ్చింది—

ఏ బట్టలు పాడైపోతా యనుకుని ఇటువంటి పన్లకి దూరంగా ఉండడానికి ప్రయత్నిస్తానో, అది జరిగేపోయింది.. ఎంత జాగ్రత్త వహించినా—ఇంక బట్టలు ఎటూ పాడ య్యాయి గనక, భోషాణం అంతు కూడా తేల్చేద్దామని బుద్ధి పుట్టింది. దాన్ని కదపడమే ?—భీమారావని పేరు పెట్టుకుని ఎందుకూ ?— ఊపిరి బిగబట్టి వెడల్పువే పాకచెయ్యి, పొడుగువే పాకచెయ్యీ పెట్టి, జై వీరాంజనేయా అని ఒక్క పట్టు పట్టాను. ఐమూలగా ఒక అడుగు జరిగింది. వెనక ఖాళీ ఏర్పడింది. కాని, పక్కలకిఅయి గాదికీ, ఇటు గోడకీ జామ్ అయిపోయింది. అటూ యిటూ కూడా కదలదు. భోషాణం ఎక్కి అటువైపు దూకబోయేముందు ఒక్కసారి అడుగు వెనక్కి మళ్లింది. కింద ఏ పామైనా ఉంటే ? పైన అటక, దాన్నిండా కొబ్బరికాయలు—పచ్చికాయకు ధర రాదని అటక మీద ఆరనిచ్చారు. డీడీ అయింతర్వాత అమ్మడం అలవాటు— వెనకోసారి అటకమీద పాము చేరి, అక్కణ్ణించి ఎలాగో కిందికి చేరుకుని భోషాణంకింద చుట్ట చుట్టుకుని పడుకుంది. భోషాణం తప్పించి పగ్గం అనుకుని చేత్తో ముట్టుకోబోయిన పాలేరు ఆగిచూస్తే పామై కూర్చుంది. అదృష్టం బాగుండి, అది ఎర మింగి కదలలేని స్థితిలో ఉంది గాబట్టి, గడిచింది గండం. పాములవాణ్ణి పిలిపించి రెండు రూపాయలు, పాత పంచా యిచ్చి దాన్నవతలకి సాగనంపేసరికి తాతలు దిగి వచ్చారు. పాముని చంపడం అంటే మా అమ్మమ్మ కర్రుచ్చు కుంటుంది. "సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, తోటలో వెలిశాడు— అయినా మన్నేం చేయనప్పుడు దాన్నెందుకు మనం ముట్టు కోవాలి ?'' అంటుంది. ఆ లాజిక్కు బాగానే ఉంటుంది గాని, చెయ్యి చేసుకోవడంలో ఎవరు ముందు చేసుకున్నా ప్రమాదం మనకే ననే విషయం ఆవిడ అంగీకరించదు. అటువంటి ఆవిడ మొండిపట్టువల్ల ఎన్నో అనర్థాలు జరుగుతున్నా, పెద్దదనే గౌరవం నిలబెట్టి యిక్కట్లు కొని తెచ్చుకోవడం తప్పనిసరై కూర్చుంటుం దెన్నోసార్లు

ఛీ! ప్రాణంమీది తీపి ఎంతది. ఒక్క అడుగు ముందుకి వెయ్యడానికి ముందు ఎన్ని ఆలోచనలు వచ్చాయి ? నూటికి తొంభై తొమ్మిది పాళ్లు కింద ఏమీ ఉండే ఆస్కా రము లేదు. ఇన్నాళ్లు మూసిపెట్టిన తలుపులు ఒక్కసారి తెరిచిన అలికిడికి మొదట్లో తొలగిపోయిన ఎలకలాగే, ఏ పామో గీమో ఉన్నా వెళ్లిపోయి ఉంటుంది విధిగా. అయినా ఏమో ఎవరు చెప్పగలరు ? కటుక్కున కాటేస్తే, గుటుక్కు మంటుంది ప్రాణం. తరువాత మన కెంత లాజిక్కు తెలి సినా ప్రయోజనం ఉండదు. కేవలం ఇటువంటి భయానికి

లోనయ్యే ఎన్నో పనులు మన ఇష్టానికి వ్యతిరేకంగా, చేస్తుంటాము. కేవలం ఒక్క సంఘటన ఫలితంగా, ఎన్నోచోట్ల విఫల నమ్మకాల్ని పట్టుకు దేవుళ్లాడుతున్నాం. దేముడుమీది భక్తి కంటె, భయమే ఆస్తికత్వానికి వెన్నెముకై కూర్చుంటుంది గదా ?

తెగించి కిందికి ఉరికాను. ఏదో పాకిన అలికిడై గుండె జల్లుమంది. కిచకిచమంటూ మూషికరాజు బైటికి కదలడంతో, అగాధంలో పడ్డ వాడికి ఆధారం దొరికినట్టయి మనస్సు కుదుటబడింది.

కింద చెత్తంతా చేతులతో కెలికి, క్రర పెట్టి భోషాణం కింద పెల్లగించినా, ఫలితం శూన్యం. భోషాణం యథాస్థానానికి తెచ్చేసరికి తలప్రాణం తోకకి వచ్చింది. అలమార్లన్నీ వెతికాను. అక్కర్లేనివన్నీ కనబడ్డాయి గాని, తాళంచెవి మాత్రం కనబడలేదు.

అది లేందే భోషాణం తెరవకూడదు. తెరిచామా, మళ్లీ పడదు. ఒకవేళ పడినా అదేవిధంగా ఇతర్లకి దారి చూపించడం అవుతుంది గనక, ఆపని చెయ్యకూడదు. "కరిచి పారిపోతాడేవ్?" అన్నాట్ట, దొంగని పట్టుకున్న పెళ్లాంతో మొగుడు. అంతసేపూ ఏంచెయ్యాలో తెలియక గిజగిజ కొట్టుకుంటున్న దొంగ, ఇది విని ఆమె చెయ్యి కొరికి పారిపోయాట్ట ! ఇటువంటి సందర్భం ఏది వచ్చినా, మా అమ్మ యీ సామెత విసురుతుంది.

వెధవది ! అస లిన్ని జాగ్రత్తలు పడే మతులు పోగొట్టుకుంటున్నామేమో ననుకుంటా న్నేను. పెట్టికి తాళం, అందులో అరకి తాళం—గదికి తాళం, ఇంటికి తాళం—బతుకంతా తాళాలు వెయ్యడం తియ్యడాలతోనే సరిపోతుంది. ఇన్ని తాళాలు వేసినా, పోయేరోజొస్తే పోతూనే ఉంటాయి. ఘరానా దొంగలొస్తే తాళాలు తీసే శ్రమ కూడా మనకే అప్పగిస్తారు. అసలీ తాళాలు, ప్రతీదాన్ని పదిలంగా అట్టే పెట్టాలనే కాంక్ష, యివన్నీ కలిసే మరిన్ని భయాల్ని, మరిన్ని అనుమానాల్ని మనలో రేకెత్తిస్తాయేమో నని నా అనుమానం.

అసలు ఈ తాళాలు, తప్పెట్లు మాసిపోయే రోజెన్నటికైనా వస్తుందా ? ప్రతి మనిషి యిన్నివిధాల భద్రతలు కోరుకుని బాధ్యతలని, బాధలని, అశాంతిని ఎందుకు కొనుక్కొంటున్నాడు ? ఈ గొడవంతా లేకపోతే ఎంత అశాంతి తగ్గిపోతుంది ?

సరదాకోసమని సినిమాకి వెళ్లడం—కూర్చున్న అరగంటకి, ఇంటి తాళం సరిగ్గా పడిందో లేదో అని అనుమానం రావడం—ఇంక యమబాధ ప్రారంభం !

ఇన్ని అవస్థలూ ఎందుకు చేస్తున్నాం ? లేమివల్ల !

దేశంలో అన్నీ కావలసిన దానికంటే ఎక్కువ ఉంటే ఇటువంటివి, ఉండవేమో ? గుప్తుల కాలంలో మణి మాణిక్యాలు కిరాణా దుకాణాల్లో తట్టలలో పోసి అమ్మేవారట ! వాటి విలువ తెలియక కాదు ! ఆధిక్యంవల్ల. కూరగాయలు తట్టలలో అమ్మడంలా ? అస లింతకీ, యీ విలువలన్నీ మనం ఏర్పరచుకున్నవేగా ! వజ్రాల ధరకీ, నిజంగా దానికున్న ఉపయోగానికీ సంబంధం ఉందా ? వాటి మెరుపుమీది మోజేగా, వాటి ధరనంత పెంచుత !

దబ్‌మని చప్పుడై మనస్సు మళ్లింది.

ఎన్నాళ్లనించో ఆ ఫోటో బరువుని మోసి మోసి యీనాటికి రిటైరై పోదల్చుకున్న మేకు, ఫోటోని కింద పడేసింది. అద్దం బద్దలై ముక్కలు ఇల్లంతా జిమ్మబడ్డాయి. జాగ్రత్తగా ముక్కలన్నీ ఒకమూలకి పోగుచేసి, ఫోటో తీసి లోపల పెట్టెయ్యబోతూ, దానికేసి ఒకసారి దృష్టి మరలించాను. మా ఎస్సెస్సెల్సీ ఫోటో. అప్పటికి నేను వేలెడంత ఉండేవాణ్ణి. చెవులకి పోగులు. మధ్య పాపిడి. నవ్వబోయినట్టున్నాను—ఏడుపుముఖం పడింది.

అందులో ఉన్న ఇతర్లు అయిదారుగురు తప్ప ఇతర్లేం చేస్తున్నారో తెలీదు. వర్మ ఏదో ప్రయివేట్ కంపెనీలో ఎక్కౌంటెంట్. శాస్త్రి ఎం. ఏ. ప్యాసై లెక్చరర్ అయ్యాడు. శంకరం రైల్వేస్‌లో ఎంజనీరు—రాజుగాడు మేష్టరు.

మేష్టర్లంతా ఇప్పటికీ బాగున్నారు. జపాన్ చిమ్నీ అని ఒకరికీ, అప్పడాల పిండి అని మరొకరికీ, ద్వితీయ నామాలుండేవి. మా రాజుగాడు మేష్టర్లని తెగ ఏడిపించేవాడు. ఇప్పుడు వాడెలా వేగుతున్నాడో పిల్లల్తో. కాని, ఇటువంటి వాళ్లకి ఒక సులువుంటుంది. కుర్రాళ్లు చేసే అల్లరి విద్యలన్నీ వా రిదివరకు ప్రయోగించినవే గనక, వాటికి మందులు ముందే తయారుచేసుకుంటారు. దొంగని దొంగే పట్టుకోగలడనే సామెతగా !

నేనూ, నాతోటి లెక్చరరూ యిద్దరం invigilators గా ఉన్నాం ఒక పరీక్షకి. నేను ఇటూ అటూ గంభీరంగా తిరుగుతూనే ఉన్నాను. ఇంతలోకే ఆయన నేను నడుస్తున్న వరుసలోనే ఒకడి దగ్గరికి వెళ్లి వాణ్ణి నిలబెట్టి ఇంత కట్ట కాయితాలు పట్టుకున్నాడు. నాకు మతిపోయింది. ఆయనెక్కడో ఒకమూల అంటే అంటనట్టుండి ఇట్టే పట్టుకున్నాడు కాపీ. నేను పది జన్మలెత్తినా పట్టుకోలేక పోదును. ఆయన్నభినందించి ఎల్లా పట్టుకున్నాడో అడిగాను. ఆయన చెప్పింది వింటే ముచ్చెమటలు పోశాయి—ఆయ నేమన్నాడని ? "గురువుకే నామం పెడతారండీ వీళ్లు ? ఈ పద్ధతులు నా దగ్గరా ?—ఇవి మేం వాడి పారేసినవిగదూ ?" అని.

నలుగు రమ్మాయి లుండేవారు మా క్లాసులో. జపాన్ చిమ్నీ మ్మగారు వాళ్ల బెంచీలవేపే తారట్లాడే వాడు పాఠం చెప్తున్నంతసేపూ. మల్లిక ప్లీడరుగా రమ్మాయి. అప్పుడప్పుడే ఓణిలు వేసుకుంటూండేది. తెలుగులో ఫస్టు మార్కుకి

మా యిద్దరికీ బలే పోటీ ఉండేది. చాలా తక్కువ తేడాలో వచ్చేవి మార్కులు మా యిద్దరికీ. పేపర్లిచ్చిన రోజున తెలుగు మేష్టారి దుంప తెంపేవాళ్లం ఇద్దరం. ఆయన పైకి విసుక్కున్నా లోపల ఎంతో ఆనందించేవారు. ఇప్పుడు మల్లికేం చేస్తోందో, పెళ్లి చేసుకుని ఏ నలుగురి పిల్లల తల్లో అయి ఉంటుంది.

రాజ్యం అని ఇంకో అమ్మాయి. ఆయేడు డింకీ కొట్టించింది. ఆమధ్య మ్రెడాస్‌నించి వస్తుంటే కనబడింది. ఇద్దరు పిల్లలు. మొగుడు డాక్టర్ట, తెనాలిలో—

"మీపేరు రామం కదూ ?—" ముక్కు మొహం తెలియని ఓ యిద్దరు పిల్లల తల్లి అడుగుతుంటే మతిపోయింది—అవునన్నాను.

"అయితే నన్ను గుర్తుపట్టలే దన్నమాట ! నేను రాజ్యాన్ని" అంది. సన్నగా రివటలా ఉండేది, ఏనుగంత అయిపోతే, నేనేం గుర్తుపట్టను ?

"అరె—నువ్వా !— నన్నెల్లా గుర్తుపట్టావ్ ?" అడిగాను, ఇంకా ఆశ్చర్యంగానే.

"మాటిమాటికీ పెదాలు తడుపుకోవడం నువ్వింకా వదల్లేదుగా—అదే కాదులే—నిరుడు మీ సరళగారింట్లో నువ్వెదిగిన తరవాతి ఫోటో చూశాను." అంది నవ్వుతూ. క్లాసులో ముంగిలా ఉండేది. ఇప్పు డెంత మాటకారి అయిందో ?

"మీ ఇంట్లో వంటమనిషి ఉందా ?" అడిగాన్నేను.

"ఉంది—ఏం ?" మహాశ్చర్యంగా అడిగింది.

"ఇక లావెక్కక చస్తావా ?—"అనుకోకుండానే అనేసి, నాలిక్కరుచుకున్నాను.

కోపం వస్తుం దనుకున్నాను గాని—నిండుగా నవ్వింది.

"లావు తగ్గడానికి మీ ఆయన మందేం చెప్పలా ?" మళ్లీ అడిగాను.

"చిలిపితనం పోలా రామం, నీ కింకా ?—"

"ఎస్సెల్సీ మళ్లా కట్టావా ?"

"ఊహూ !"

"మల్లిక ఎక్కడుందో తెలుసా ?"

"ఊహూ—మన స్కూలుఫైనల్ అవగానే మా నాన్నగారికి అక్కణ్ణుంచి ట్రాన్స్‌ఫరైంది. మల్లిక ఇంటర్‌లో జేరతానంది. తరవాతేమైందో—తెలీదు."

పాతవాళ్లందర్నీ జ్ఞాపకం చేసుకున్నాం.

రాజ్యం ఇంగ్లీషు బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకుంది. పిల్లల్తో్ ఇంగ్లీషే. "పిల్లలకీ ఇంగ్లీషెందుకు ?" అడిగాను.

"ఇంకో భాష వస్తే మంచిదేగా—ఆదికాక ఆయనకదే యిష్టం—"

"చచ్చాంపో—"అన్నాను.

మందస్మితం చేసింది.

వాళ్ల ఊరు రమ్మని మరీ మరీ కోరింది. తప్పకుండా వస్తానని వాగ్దానం చేశాను. కాని నాటికీ నేటికీ వెళ్లనేలేదు. ఏమయితేనేం, అవాల్టి ప్రయాణం హాయిగా గడిచిపోయింది.

రాజ్యం, మల్లిక, కాక మిగతా యిద్దరమ్మాయిలు క్రిస్టియన్లు—అందులో మేరీ భారతికి మా ఎస్ ఎస్ ఎల్ సి. లోనే పెళ్లయిపోయింది. మమ్మల్నందర్నీ పిల్చింది. క్లాసంతా చందాలు వసూలుచేసి పదిహేను రూపాయలు బహుమతి కొనిచ్చాం. పార్టీ యిచ్చారు. అప్పటి కింకా మా మొహాల్లో కొందరికి కేక్ తినే అలవాటులేక, తిని డోక్కున్నారు. సిద్ధాంతిగా రబ్బాయి ఒకడు తినేసి, అందులో కోడిగుడ్డు కలుస్తుందని తెలిసి, వాళ్ల నాన్న అవాళ తన తద్దినం పెట్టేస్తాడని వాపోయి, మా అందరిచేతా ఎవ్వరికీ చెప్పమని ఒట్లు వేయించుకున్నాడు.

నాలుగో అమ్మాయి లిల్లీవైట్ గజనీతో పోటీ పడి పడి, చివరి కెల్లా అయితేనేం, బియ్యే అయిందనిపించి, ఆపైన బి యిడి పట్టా పుచ్చుకుని పంతులమ్మ అయింది.

తల్చుకుంటే, అన్నీ నిన్న జరిగినట్టుంటాయి.

మా హిస్టరీ మేష్టారు రోజూ క్లాసులో ప్రశ్నలడిగి చెప్పలేకపోతే పాతికసార్లు రాయించేవాడు. హిస్టరీ క్లాసంటే అందుకే సింహస్వప్నంలాగుండేది. ఇంపొజిషన్ రాయనప్పుడల్లా, ఆయనకి జ్వరం రావాలని ఎన్నో దేవుళ్లకి మొక్కేవాళ్లం. అలా జరిగేది కాదు. ఇంపొజిషన్ రాయనివాళ్లని దగ్గరకు పిల్చి, దండ దగ్గిర కండల్ని బొటనవేలు చూపుడువేలూ మధ్య పట్టి నలిపి, నరకం చూపెట్టేవాడు.

ఆ భయంతోనే చచ్చినట్టు చదివేవాళ్లం. అందుకే మానవత్వంమీద ఎంత నమ్మకం తగులడ్డా, శిక్షకి విలువ ఉండనే ఉందేమో నని పిస్తుంది. భయంతోనూ, బెదురుతోనూ సాధింపబడేవి సాధింపబడుతూనే ఉన్నాయి.

హిస్టరీ మేష్టారు అమ్మాయిలు యింపొజిషన్ రాయకపోతే కిక్కురుమనేవాడు కాదు. అది మా మొగవెధవ లందరికీ మహా ఏడుపు తెప్పించేది.

ఒకరోజున అందర్లోకి కుర్రవేధవన్నైన నన్నుసిగొల్పి "అమ్మాయిలని ఏం అనరేం, ఇంపొజిషన్ రాయకపోయినా ?" అని అడిగించారు. "నువ్వు కూడా అక్కడే కూర్చుంటే నిన్నూ అడగ్గ్రా !" అన్నా డాయన. నాకు చచ్చే సిగ్గు ముంచుకొచ్చి, నా స్వయంబుద్ధివల్ల అడగలేదని చెప్పి ఆయన సానుభూతి పొంది, తక్కిన కుర్రాళ్లచేత తల వాచేటట్టు చివాట్లు తిన్నాను.

అమ్మాయిలని ఏమీ అనకపోవడంవల్ల, వాళ్ళు సహజంగానే అశ్రద్ధ చేసేవారు. నా మటుకు నాకు, ఈనాటికీ నిద్దట్లో లేపి అడిగినా, మూడో పానిపట్టు యుద్ధం ఎప్పుడు జరిగిందో, ఆఫ్రికా ఖండాన్ని ఎవరు కనిపెట్టారో వెంటనే చెప్పెయ్యగలగడానికి ఆ శిక్షణే కారణం.

ఆడవాళ్లకి ఇటువంటి కన్సెషన్స్ ఎక్కువయిచ్చే వారి బలహీనతలని మరింత పెంపొందిస్తున్నారని నా భావం. అన్నిటా వారికి అవసరానికి మించిన రక్షణ యిచ్చి, వార్ని పిరికి వాళ్ళగా తయారు చేస్తున్నారు. ఆరుగురు పిల్లల తల్లి మా రెండో అక్క—ఇప్పటికి ఆవిణ్ని ఒక్కత్తినీ ప్రయాణం చెయ్యడానికి ఒప్పుకోడు మా బావ—ఇటువంటి అలవాటుతో ఆమె నిజంగానే, ఒంటరిగా ప్రయాణం చెయ్యలేని స్థితికి వచ్చింది. ఇటు వచ్చేటప్పుడు, అటు వెళ్లేటప్పుడు—విధిగా బాడీగార్డుకి ఇంకో వంద రూపాయలు పొయ్యాల్సిందే—ఎవడు తిన్నట్టు ? అందుకే, ఆమెని రమ్మనే కంటే, మేమే వెళ్లి చూసొస్తే నయమనిపిస్తుంది నాకు.

సుకుమారి కందిపోతుందేమో నని, రాజ్యానికి వాళ్లాయన వంటమనిషిని కుదిరిస్తే, శ్రమ తక్కువై ఆమె శరీర వైశాల్యం హద్దులు దాటిపోతోంది—

మొగాడి అండ లేకుండా ఆడది బతకలే దనుకోడం !

తీరా చూస్తే ఆడవాళ్ల కున్నంత తెలివి, త్యాగం మొగాళ్లకు చస్తే ఉండవు.

మా ఊళ్లో డాక్టరమ్మ—వేలార్జిస్తోంది. తమ్ముళ్లనీ, చెల్లెళ్లనీ ఎంతో పైకి తీసుకువచ్చింది, నిస్వార్థంగా. పెళ్లి చేసుకుంటే ఆ వచ్చే మొగుడు ఆటంకపరచవచ్చని అనుమానంవేసి, తమ సంసారం అంతా గట్టెక్కేవరకూ, అవివాహితగానే ఉండిపోయింది. లక్ష లార్జించే మొగాడి తమ్ముళ్ళూ, అప్ప బావలు అడుక్కుతినడం, నా కళ్లారా చూశాను.

ఆడవాళ్లని మగాళ్ళు మరో విధంగా కూడా బలహీనంగా తయారుచేస్తున్నారు. వాళ్లల్లో భావదాస్యం అంకురింపజేసి, వాళ్ల మెదళ్లని అలా మొద్దుబారి పోనిస్తున్నారు. ఎంత విచిత్రం కాకపోతే, యీనాటికీ సీతా సుమతులనీ, కేవలం ఆత్మాభిమానం లేనట్లు చిత్రింపబడ్డవాళ్లని, ఆదర్శ సతీమణులని పొగడుతారా ? చాకలాడు ఏదో కూత కూస్తే, శ్రీరాముడు అది నమ్మో, నమ్మకో సీతా అమ్మవార్ని అడవుల పాలు చేస్తే, కుక్కిన పేనులా ఊరుకున్న ఆవిడ ఆదర్శ సతీమణా ? సుమతి చూడండి—కుష్టురోగి అయిన భర్తని వేశ్య యింటికి తీసుకువెళ్లిందట తట్టలో పెట్టి ! చిట్టితల్లి! ఆవిడో, మహిళల్లో మణిపూస—

ఇటువంటివి చదివి నరనరానా జీర్ణించుకునే, నిక్షేపంలాంటి మా మూడో అక్క, చేజేతులా గొంతుక్కోసుకుంది. ప్రాణమే పోయింతర్వాత పాతివ్రత్యం ఎందుకూ ? తగులణ్ణా? నానా హింసలు పెడుతుంటే వాణ్ణే పట్టుకు దేవులాడి, చివరకు భరించలేక, ఆత్మహత్య చేసుకోకపోతే, యింటికి చక్కా రారాదూ ?—

ఇరుగు పొరుగమ్మలు, కొండొకచో తలిదండ్రులు, అక్కచెల్లెళ్లూ కూడా అవహేళన చెయ్యొచ్చు-అదీ భరించడం కష్టంగావే ఉంటుంది,

కాని, మన్ని కాదనుకుంటే పోలా ?

అసలు తెగించకవేపోవాలిగాని, తీరా తెగిస్తే ఎవడూ ఏం చేసేది ఉండదు.

మా అక్కయ్యగారి ఊళ్లో మరో డాక్టరమ్మ !—పెళ్లికాకుండానే పిల్లాణ్ణి కని దర్జాగా పెంచుకుంటోంది. ఆ చుట్టుపక్కల ఊళ్లల్లోనే ఆపరేషన్స్‌లో అంత చెయ్యలేదు. అవసరం ఉన్నవాళ్ళు చచ్చినట్టు వస్తున్నారు. కుప్పతిప్పలుగా ఆర్జిస్తోంది డబ్బు. చాటున అనుకుంటారు ఆమెను—కాని ఏం చెయ్యగలిగారు ? అస లెందుకు చెయ్యా లంటాను? పెళ్లి కానంతమాత్రాన పిల్ల లుండకూడదని రూలేమిటి? పెళ్లయి పిల్లలు పుట్టి, ఆ మొగుడు చచ్చిపోయో, పారిపోయో ఉంటే ఆ పిల్లల్ని ఆమె సాకవలసి వస్తే మాత్రం యింతే కాదూ ?

అంటే యింతకీ అధికారం, శక్తి, ఎవరికుంటే వారి మాట చెల్లుతుంది. వారే ఆట ఆడినా లోకం హర్షించడం తప్ప, ఏమీ చెయ్యలేదు. అది గ్రహించినవాళ్లంతా ఆ అనువు ఉపయోగించుకోనే ఉపయోగించుకుంటున్నారు. ఉపయోగించుకోడం చాతకానివాళ్ళు ఉరోసుకుంటున్నారు. ఆత్మవంచన చేసుకుంటున్నారు .... హీనంగా బతుకుతున్నారు !

ఏనాటికైనా యీ పద్ధతులు మారి, ఆడది కూడా మగాడితో సమంగా సంచరించగలిగే రోజు లొస్తాయా

అనుకుంటాన్నేను. వస్తే చిటపటలాడుకుంటుంటారంతాను. కాని, అల్లా అవసరంలేదే—మొగాడు మొగాడు అభిప్రాయ భేదాలమధ్య బతకటంలా ?

కాని, మొగాళ్లంతా తమ నిరంకుశత్వాన్ని త్యజించ గలరా, అని ?

ఇన్ని ఆలోచనలొస్తాయి నాకు ?—గట్టిగా మా ఆవిడ బెదిరిస్తే ఓర్చలేను నేను. మాటకు మాట అందిస్తే చెయ్యి కూడా చేసుకున్న రోజులు కద్దు. నేను దానిమీద విసుక్కుంటే అది నా ఆధిక్యానికి చిహ్నం. కాని, అది ఎదిరిస్తే, దానికి మంచీ మర్యాదా లేనట్టు !

ఈ ఆధిక్యం చెల్లడానికి కారణం, చాలా యిళ్లల్లో ఆడ దానికి స్వయంపోషక శక్తి లేకపోవడం ! మరి, బియ్యే ప్యాస యిన మా ఆవిడ కూడా, ఎందు కూరుకుంటుందో ఆశ్చర్యమే నాకు.

ఫోటో నా చేతిలోనే ఉంది—మనస్సు విహారం చేసి వచ్చింది.

తాళంచెవి కనబడే ఎత్తు కవబడలేదు.

ఇకపోతే, ఆ పన్ను రశీదులేవో వెతకాలి !

పాత రశీదులు లేకపోతే యిప్పు డెంత కట్టాలో తెలీదు. మునసబు నడిగితే కాకుల్లెక్క చెప్తాడు. పన్ను కట్టక పోతే జప్తు నోటీసొస్తుంది. అంచేత అది వెతకడాని కుపక్ర మించాను. ఉత్తరాల గుత్తిలో గుచ్చాను అని అక్కయ్యెప్పుడో అన్నట్టు గుర్తు.

వెంకటేశ్వరస్వామి ఫోటో తగిల్చిన మేకునే ఉందో ఉత్తరాల గుత్తి. ఎంత వెతికినా రెవిన్యూ పన్ను కాయితాలు కనబడలేదు—

పాత ఉత్తరాలు చూడగానే, అక్కడక్కడ చదువుదా మనే బుద్ధి పుట్టింది. అడుగు ఉత్తరం ఇరవై రెండేళ్ల క్రితంది. మన కప్పటికి అర్ధదశాబ్ది వయస్సు.

నాన్నగారు రాసిం దది—ఆయన పోయి పదిహేడేళ్లయిపోతున్నది—పెద్దక్కకి రాశారు.

"చి. సౌ. సరళని దీవించి మీ నాన్న వ్రాసేది :

నీ దగ్గర్నించి ఉత్తరం వచ్చి పదిహేను రోజులు కావస్తోంది. ఎన్నో పన్లలో నేనే తీరిక చేసుకుని వారానికో ఉత్తరం రాస్తుంటే నువ్వు ఆలస్యం చేస్తుంటే, నాకు చాలా బాధగా ఉంటోందమ్మా !

నే నొక్కణ్ణే గదా ఉంటున్నాను. ఉత్తరాలే నా కూరట కలిగించేవి. ఇకనించైనా నువ్వు నాలుగేసి రోజులకో ఉత్తరం తప్పకుండా రాయాలి.

బాంబుల హడావిడి తగ్గేదాకా, అమ్మా పిల్లలూ విజయనగరంలోనే ఉండక తప్పదు. ఇప్పట్లో బాంబుల హడావిడి తగ్గేట్టు లేదు. ఊరంతా కారడవిలా ఉంది. వదులుకోగలిగినవాళ్లంతా ఉద్యోగాలు వదిలేసి వెళ్లిపోతున్నారు.

రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి మనది. యాభై అరవై వే లార్జించినా ఎప్పటిదప్పుడే ఖర్చయిపోతూ వచ్చింది. పిల్లలింకా ఎదగలేదు. గౌరీ, వాణీల కింకా పెళ్లిళ్లు కావాలి. నానీ చదువింకా మొదట్లోనే ఉంది.

వారం వారం విజయనగరం వెడుతున్నాను. వెళ్లడమే గాని మనశ్శాంతి ఉండదు. అమ్మా నేనూ పోట్లాటే ! పిల్లల కేం మిగల్చలేదని, పెళ్లి పేరంటాలు ఎల్లా జరుగుతాయోనని దానికేః బెంగ. అయితే మాత్రం నేనేం చెయ్యగల్ను.? చాత నైంది చేస్తూనే ఉన్నాను. అడ్డమైనదార్లూ తొక్కి అన్యాయంగా ఆర్జించడం నా చాతకాదు. అది తెలీకపోతే యీ అవస్థలు తప్పవేమో ? తను ప్రతిదానికీ ఊః దూరపు టాలోచనలు చేస్తుంది. మంచి బట్టలేనా కట్టుకోదు. ఎంతసేపూ కూడిక, కూడిక అంటుంది. ఎన్నాళ్లనించో ఒక స్థాయికి అలవాటు పడ్డవాళ్లం, ఇవ్వాళ పిల్ల లెదుగుతున్నారని దిగిపో గలమా ?

అన్నింటికీ ఆ దైవమే ఉన్నాడు. కొండంత తెలివి కంటె ఆవగింజంత అదృష్టం మేలు.

నీ బెంగే నన్ను కృంగదీస్తోంది. చేజేతులా నీ గొంతు కోశాను. నువ్వు రాసినవన్నీ వింటుంటే నా కడుపు తరుక్కు పోతోంది. హిందూసమాజంలో పుట్టినవాళ్లం. నీతీనియమం, శాస్త్రం, చట్టం, దేన్నీ వదులుకోలేని బలహీనులం.

కష్టాలు భరించడానికి అలవాటుపడాలి. సహనం వహించి మంచి రోజులకి ఎదురుచూడమని తప్ప నేనేం చెప్పగలను ?

జీవితంతో పోరాటం తప్పదు. ఓడినకొద్దీ జయం పొందాలనే ఆకాంక్ష ఎక్కువ చేసుకోవాలి. అప్పుడే బతగ్గలం. బతకక చెయ్యగలిగిందేం లేదుగదా ! జన్మ అంతం చేసుకుంటే పునర్జన్మ యింతకంటే నికృష్టమైనది రావచ్చు. ఈ జన్మలో మానవులుగా అవతరించడమే ఎంతో అదృష్టం అనుకోవాలి. ఏనాటి పాపమో ఈనాడు అనుభవిస్తున్నాం. ఈనాడైనా జాగ్రత్తగా ఉంటే కనీసం ముందు జన్మలోనైనా సుఖపడగలమేమో. నిరాశ పెంచుకోకు. బతకడానికి ప్రయోజనం, అర్థం వెతకద్దు. ఉన్నంతలో కష్టాలు మర్చిపోయి సుఖపడడానికి ప్రయత్నించాలి.

భగవద్గీత శ్రద్ధగా చదువుకుంటున్నా వనుకుంటాను. హిందీ పఠనం మానవద్దు.

రేపు ఆదివారం. పొద్దున్నే విజయనగరం వెళ్లాలి. నేను వెళ్లకపోతే మీ అమ్మే బయలుదేరి వచ్చేస్తుంది. అదీకాక వారానికో రోజైనా వెళ్లి పిల్లల్తో ఒకరోజు గడపకపోతే ఎల్లా ? ఈ వెధవ హోటలు కూడు తింటూ, వారానికో రోజైనా మీ అమ్మ చేతివంట తినకపోతే అసలు ప్రాణం నిలబడదు.

పోట్లాడుతుం దన్నమాటే గాని వెడుతుంటే కళ్లమ్మట నీళ్లెట్టుకుంటుంది. ఉద్యోగం మానెయ్యమంటుంది. కలో గంజో తాగి బతికి, బాంబుల హడావిడి తగ్గిం తరువాత మళ్లీ ఉద్యోగ ప్రయత్నం చేసుకోమంటుంది. వెర్రిది ! ఈలోపున ఎల్లా గడవడం ? నగలమ్మేద్దా మంటుంది. ఎన్నాళ్లొస్తుందా డబ్బు ! యుద్ధం ఎన్నాళ్లుంటుందో ఎవరం చెప్పగలం ?

రాత్రి అప్పుడే పదకొండు అవుతూంది. ఇది నీకు మంగళవారం అందుతుంది. బుధవారం నువ్వు సమాధానం రాస్తే గురువారం నాకు అందుతుంది.

ప్రసాదానికి ఆశీర్వచనాలు. అమ్మమ్మకు నమస్కారాలు.

నీకోసం ఒక రాట్నం కొన్నాను. మీ పిన్ని విజయనగరం నించి అటు వచ్చేటప్పుడు, ఆమెచేత పంపిస్తాను.

ఆశీస్సులతో,
మీ నాన్న—"

అప్రయత్నంగా కళ్ల నీళ్లు తిరిగిగాయి.

పధ్నాలుగేళ్ల పెద్దక్కకి నాన్నగారు రాసిన ఉత్తరం అది !

అందర్లోకి చిన్నవాణ్ణయిన నాకు నాన్నగారితో పరిచయం తక్కువ. నాకు తెలిసినవల్లా ఆయన ఆప్యాయత— కోరితే కొండమీది కోతినైనా మాకోసం తెచ్చి యిచ్చే పట్టుదలాను. అమ్మ ప్రతి విషయానికి మమ్మల్ని కసురుకుని అప్పుడప్పుడు చెయ్యి కూడా చేసుకునేది. ఆ రోజుల్లో అమ్మ ఒక రాక్షసిలాగ నాన్నగారు దేవతలాగా కనిపించేవారు. దీనికి తోడు, ఆయనకి ఆరోజుల్లో స్థిరమైన ఉద్యోగంలేక, ఒక ఉద్యోగం అయిపోగానే మరెక్కడ దొరికితే అక్కడికి వెళ్లిపోయేవారు. దానివల్ల సాధారణంగా నే నెరుగున్నంత వరకు ఎక్కువకాలం రెండు కాపురా లుండేవి. ఆయ నొక్కరూ ఒకచోట—మేమంతా ఒకచోట.

ఇవాళ తల్చుకుంటే ఆయన జీవితం ఎంత నిస్పృహా' నిర్లిప్తతల మధ్య గడిచిందా అనిపిస్తుంది.

పెద్దక్క పరళకి అమ్మ, అమ్మమ్మల బలవంతం వల్లమా మూడో మామయ్యతో పెళ్లి చేశారు. చదువు లేక పోయినా ఆస్తి ఉందిగదా అని యిచ్చారు. అతనికి తరువాత మతి చలించింది. దానికి తోడు, అతను పుట్టి పెరిగిన వాతావరణంలో హృదయ వైశాల్యానికి తావులేక, అక్క బతుకు నరకంగా తయారైంది.

నాన్నగార్నడిగితే, అంతా అమ్మ తప్పే నంటారు. నిజానికి అది కాదు. అమ్మ చెప్పినంతమాత్రాన అక్కకి అంత చిన్నతనంలో, తగని సంబంధం ఎవరు చెయ్యమన్నారు? ఇతర విషయాల్లో సాధారణంగా తనకు నచ్చినట్టు వ్యవహరించే ఆయన ఇందులో మాత్రం అమ్మ మాట ఎందుకు వినాలి ?

పదేళ్లు పనిచేసిన రైల్వే ఇంజనీరు పని స్వాతంత్ర్యోద్యమ కాంక్ష కొద్దీ ఖద్దరు సూట్లు వేసి, తలపాగాలు చుట్టుకోవడంవల్లా, ముక్కుకు సూటిగాపోయి ఇటు పైవాళ్లకి అటు కింది వాళ్లకీ కంటకంగా తయారవడంవల్లా ఊడిపోయింది.

తరవాత ఒకటి రెండేళ్లు కంట్రాక్టులు చేశారు. తప్పుదారిన పడకపోతే కంట్రాక్టు ఎప్పుడూ నష్టమే తెస్తుందనే విషయం ఈ రోజుల్లో కుర్రాళ్లకి కూడా తెలిసినా రెండేళ్ల అనుభవం, ఆర్థికనష్టం నేర్పిన పాఠాలవల్లగాని, ఆయన ఒప్పుకోలేక పోయారు.

ఇంక ఆ తరువాతల్లా, ఉద్యోగం ఉండడం, ఊడడాలతోనే గడిచింది. ఉద్యోగం ఉన్న రోజుల్లో మా అమ్మ పొదుపు చేసిన డబ్బు, ఊడిపోయిన రోజుల్లో పనికొచ్చేది. ఈ ఆర్థిక అనిశ్చితత్వం ఒకటి ఆయన్ను పీడించేది. ఇంకా యిద్దరు ఆడపిల్లలకి తగిన సంబంధాలు వెతికి కట్నాలిచ్చి పెళ్లి చెయ్యడం, నా చదువు గట్టెక్కడం, ఆయనకు గుండెలమీద కుంపటిలా ఉండేది.

ఆలోచనలనించి తేరుకుని మళ్లీ ఉత్తరాలు తిరగెయ్యడం మొదలుపెట్టాను.

ఇంకో కార్డు—

"మై డియర్ కాంతం"—అని మొదలు. బాబయ్య పిన్నికి రాసిందది. పిన్నికి తెలుగు రాయడం చదవడమే అంతంత, పాపం, బాబయ్య యింగ్లీషులో సంబోధిస్తాడు—నవ్వొచ్చింది నాకు.

మరో శుభలేఖ.

వ్రాయు శుభలేఖార్థములు—

# "చెరిగిపోని గతంలోకి"

స్వస్తిశ్రీ చాంద్రమాన—సంవత్సర—

మా జ్యేష్ఠ కుమార్తె శేటు వెంకయ్య బావగారి

ఆరవ కుమార్డు

సుబ్బమ్మను శరభయ్య కిచ్చి—

వగైరా, వగైరా—

ఎవరు చెప్మా—ఆఁ ! అమ్మ మేనమామ బావమరిది కూతురి పెళ్లన్నమాట ! అదే శుభలేఖ ప్రతులు మూడు న్నాయి ఒకే చిరునామాకి—

మా అమ్మ మేనమామ యించుమించు యిల్లరికం— మా అమ్మావాళ్లు వాళ్ల మేనమామ యింటి కెళ్లినప్పు డల్లా, వాళ్ల అత్తారు వీళ్లకి బట్టలు, పాతలు పెట్టి పంపడం—ఆ రోజుల్లో బంధుత్వాలల్లా ఉండేవి. ఎంత గుర్తుంచుకుని పంపించారో శుభలేఖలు !

ఈనాడు రాకపోకలు లేక, మాకు మా నాన్నగారి వంక బంధువులంతా కొత్తే—మొన్న మా దొడ్డమ్మగారు పోయా రని ఉత్తరం వచ్చి చూడ్డానికి వెళ్లి, మా పెత్తండ్రిగా రబ్బాయిని నేను, వాడు నన్నూ, గుర్తుపట్టలేక ఫలానావారు మీరేనా అని నే నడగడం—మీ రెవరని వా డడగడం—నేను చెప్పడం—ఆ పరిస్థితి కళ్లమ్మట నీళ్లు తెప్పించింది.

అంతుతెలియని రెండు మూ డుత్తరాలు కనిపిస్తే గబగబ తిప్పేశాను.

మరో ఉత్తరం—

"ఏడాది కోసారి పారేసే 60 —రు. కోసం యిన్ని సార్లు అడిగించుకోవడం మర్యాదగా లేదు. పోనీ మీరు లేనివా ళ్లయితే అసలు అడగకనే పోదును. నాకు తరగనంత ఆస్తి ఉన్నా ఈ బాధ లేకపోను.

వెంటనే డబ్బు పంపిస్తారని నమ్ముతున్నాను.

తగువే మీకు ముఖ్య మనిపిస్తే మా ప్లీడరుగారి ద్వారా నోటీసు పంపిస్తాను—

ఇట్లు—"

ఈయన మా అమ్మ మేనత్తగారి భర్త. మా అమ్మ తాతగారు కూతుళ్లిద్దరికీ భూమి రాసిద్దా మనుకుని, ఆ రోజుల్లో ధాన్యం ధర బస్తా రూపాయిన్నర, ఎద్దు ఏడు మాడలు—కావడంచేత డబ్బిస్తేనే బాగుంటుందని, చెరి 360 — రూపాయలు సాలుకోసారి యివ్వ నిశ్చయించారు.

మా తాత లిద్దరూ పంచుకుంటే, ఒక్కొక్కళ్లకి చెరి సగం పంపకం వంత వచ్చింది. అందరూ ముగ్గురు మామ య్యలు పంచుకుంటే, ఒక్కొక్కళ్ల వంతుకు రు. 60 — పంపే బాధ్యత పట్టుకుంది. మా అమ్మగారి పెద్ద మేనత్తకి మొదట్లోనే అవసరమైతే డబ్బు యిచ్చేసి యీ బాధ్యత వదిలించుకున్నారు. పోతే, యీావిడకి పంపడం తప్పలేదు.

ఆస్తి పంచుకుంటే బాగానే ఉంటుంది గాని, ఈ అరవై రూపాయలు యివ్వడం అంటే మాత్రం, మహా బాధగా ఉంటుంది మామయ్యలకి.

"ఇద్దాంలే, మించిపోయిం దేమిటి ?" అనుకుంటూనే అశ్రద్ధ చెయ్యడం, ఇల్లాంటి ఉత్తరాలు తెప్పించుకోవడం—

ఇంకా తిరగేస్తుంటే—1943 లో నాన్నగారు రాసిన ఉత్తరం కనబడింది.

కొల్హాపూరు,

"చి. సౌ. సరళకి— ............43.

నువ్వు మొన్న రాసిన ఉత్తరం అందింది. గౌరీ, వాణి, నానీలు పరీక్షలు బాగా రాశారని రాశావు—సంతోషం.

ఏణ్ణర్థం అయింది, మిమ్మల్ని చూసి.

నానీ ఏమన్నా ఎదిగాడా, అల్లాగే ఉన్నాడా ? మీరంతా ఒక ఫోటో తీయించుకుని పంపించండి—

మీ రందరికీ దూరమైపోయానన్న బాధ తప్పించి, యిక్కడ అంతా బాగానే ఉంది.

మొన్న పంపిన రెండు వందలు అందినట్టు, మీ అమ్మ యింకా రాయలేదు. కనుక్కొని వెంటనే రాయి.

మా కంపెనీవాళ్లు విశాఖపట్నంలో బ్రాంచి పెడు తున్నారు. అక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించుకునేందుకు ప్రయ త్నిస్తాను. అనుకూలిస్తే మళ్లీ అంతా కలిసే ఉండొచ్చు.

అయినా భగవదేచ్ఛ ఎల్లా ఉందో ?

నువ్వు రాష్ట్రభాష పాస్ అవడం నా కెంతో ఆనందం కలిగించిందమ్మా !

మెట్రిక్‌కి కట్టడానికి ఎందుకు ప్రయత్నించవు? చూస్తూ చూస్తూ నీ మెడకి ఉరి వేసే తగిలించానమ్మా—

గారికి సంబంధాలు చూస్తున్నారా ? నాకు తెలిసి ఉన్న వరుల జాబితా యిందుతో జతపరుస్తున్నాను. మావ య్యతో చెప్పి ప్రయత్నించమను—

ప్రసాదానికి మాటిమాటికీ యీ మతి చలించడం— ఛీ ! యివన్నీ వింటూ ఏమీ చెయ్యలేక బ్రతికుండీ చచ్చినట్టే ఉన్నానమ్మా !

———"

తరువాతి ఉత్తరాలలో— నాన్నగారికి విశాఖపట్నం ట్రాన్స్‌ఫర్—ఆర్నెల్లు తర్వాత ఆ ఉద్యోగం వదిలెయ్యడం—

మళ్లీ మరోటీ—బామ్మ జబ్బు—ఆవిడ పోవడం—నాన్నగారి ఆరోగ్యం బాగులేకపోవడం—

గౌరికి సంబంధాలు చూడ్డం అవుతుందనీ, ఆరు నెల్లు వి(శాంతి తీసుకున్నట్టు అవుతుందనీ నాన్నగారు మేం ఉన్న వూరు వచ్చేశారు. గౌరికి సంబంధం కుదరనేలేదు—

తరవాత మళ్లీ ఉద్యోగాలకి ధరకాస్తులు పంపడం మొదలుపెట్టారు.

"అబ్బ ! ఇంక కారు యివ్వని ఉద్యోగం చెయ్యలే నమ్మా !—వీళ్లు ఆరొందలు యిస్తామంటున్నారు. అయి దొందలిచ్చి కారిస్తే వప్పుకుంటాను. మె(డాసు, బెంగుళూరు బొంబాయి—ఏదో ఊరు కోరుకోమంటున్నారు. ఏవూరు అడగమంటావమ్మా—" సరళని సలహా అడిగారు నాన్నగారు.

నాన్నగారిలో మరో గొప్ప విశేషం యిది—పిల్లలందరికీ ఆలోచించే అవకాశాన్ని కల్పించేవారు. వాళ్ల బాధ్యతల్ని పెంచే వారు. చిన్నప్పటినించీ మా కందరికీ నాన్నగారి దగ్గర ఎక్కౌంట్సు ఉండేవి. డబ్బులు చేతి కివ్వకుండా తన దగ్గిరే ఉంచి యిప్పటికి నీ కింతయింది, అంటూ ఒక్కొక్కళ్ల పద్దులో వందలు, పదులూ చూపించేవారు. ఆ పద్దులు చూసి అందు లోంచే మాకు కావలసినవి యిస్తారు—అందులో అంకెలు తక్కువై పోతాయేమోననే భయంతో పిసినారులలా తయా రయ్యేవాళ్లం మేం. ఉన్నవే చాలులే బాంక్ నించి ఎందుకు తియ్యడం అన్న తత్వం అలవాటై, ఆ రోజుల్లోనే దుర్వ్యయం చేసే అలవాటు లేకపోయింది మాకు—

సరళ సోజుపెట్టి, వేళ్లు ఇటు తిప్పి, అటు తిప్పి లెక్కలు వేసి, చివరకు యిచ్చింది సలహా—

"బొంబాయి మరీ దూరం నాన్నారు ! మె(డాస్ చూసేసిందే—బెంగుళూరు అడగండి—" అంది.

"అచ్చంగా నేనూ అల్లాగే అనుకుంటున్నానమ్మా—" అన్నారు ఆయన.

సరళక్క అంతా నాన్నగారి పోలికే. అందుకే బహుశః ఆ కష్టాలూ అల్లాగే వచ్చాయి ఆమెకి—అప్పట్లో సరళక్క అంటే నాకు ఒక యమదూతలా కనిపించేది—అమ్మా, అమ్మమ్మా, ఆడుకుందుకు వెళ్లమంటే—'ఒరేయ్ ఎక్కడికి! ఆ లెక్కలు చేశావా ?' అని నిలవేసేది. నాకు ఏడుపు ముంచు కొచ్చేది. అమ్మమ్మ నాకు సపోర్టు ఇచ్చేది—"అబ్బ, అస్తమానూ చదువేటే—" అంటూ. "మీరిల్లా వెనకేసుకొస్తే వాడు ఆమీద అడుక్కుతింటాడు. నీ అలుసు చూసుకు కాదూ వాడు చదువు ఎగేస్తున్నాడు—అదివి కొడుకులకి ఒకళ్లకీ చదువులు లేకుండా చేశావు -ఇప్పుడు ఇంక మనవళ్లని వెన కేసు కొస్తున్నావు—సువ్వూరుకుండూ !" అంటూ మా అమ్మ మ్మని అంటుంటే, ఆవిడ అక్కని నాలుగు ఎందు కిచ్చుకోదా అనిపించేది.

కాని, యివ్వాళనిపిస్తుంది. సరళక్క ఆ రోజుల్లో అంత ఖాయిదాలో పెట్టకపోతే, నే నీనాడు ఎల్లా ఉండేవాణ్నో? అని.

నెల్లాళ్ల తరువాత నాన్నగారికి బెంగుళూరులో చేరమని ఆఫర్ వచ్చాయి -

ఉద్యోగంలో చేరవలసిన రోజున -టి. బి. శానిటోరి యంలో చేరారు నాన్నగారు.

అంత (కితం నించే కొద్దిగా జ్వరం, పొడిదగ్గు రావడం -వారం పదిరోజులకి కూడా తగ్గకపోవడం -విశాఖ పట్నం ఆస్ప(తిలో చూపించుకోవడం, వాళ్లు ఎక్స్ -రే తీసి టి. బి. అని తేల్చడం—తాంబరం శానిటోరియంలో చేర మనడం -అందుకు కారణాలు.

శానిటోరియం నించి సరళక్కకి రాసిన ఉత్తరాల్లో - ఆశా, నిరాశా—సంతోషం, సంతాపం—నెల్లాళ్లల్లో డిశ్చార్జి చేస్తారనీ—కాదు, మళ్లీ ఇంకో మూడునెల్లు ఉండమంటున్నా రనీ—డబ్బు నీళ్లల్లా ఖర్చయిపోతూందని బాధ—పక్కనున్న కన్నడం పేషెంట్ దగ్గర్నుంచి కన్నడం నేర్చుకోవడం—

నాన్నగారిలో యిదొకటి—ఏ (ప్రాంతానికి వెడితే ఆ భాష తప్పక నేర్చుకునేవారు. అందులో పుస్తకాలు చదివేవారు. ఆఖరికి అనారోగ్యంగా ఉండి ఆస్ప(తిలో ఉన్నా, అప్పుడు కూడా యీ భాషలు నేర్చుకోవాలనే ఆకాంక్ష ఆయన్ని వదలలేదు—సాహిత్య(ప్రియులైన స్నేహితు లందరికీ పద్యాలలో రాసేవారు ఉత్తరాలు -

ఇంకా తిరగేశాను.

గౌరిపెళ్లి శుభలేఖ -

ఒక టెలి(గాం—'రాలేను. పెళ్లి ఆపవద్దు' అని.

దాని పక్కనే నాన్నగారి ఉత్తరం—గౌరి పెళ్లి తేదీ దానిమీద—శానిటోరియం నించి—నాలుగు భాగాలు. సర ళక్కకి, గౌరికి, అమ్మకి—మామయ్యకి—

చి. సౌ. సరళకి,

బయలుదేరడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాను. కాని డాక్టర్ చూసి 'బొత్తిగా నీరసంగా ఉన్నారు—నాలుగు వందల మైళ్ల (ప్రయాణం పనికిరాదు— మొండికేసి వెళ్లారో పరి స్థితి (ప్రమాదిస్తుంది. ఇంక నాలుగు నెల్లు ఓపికపడితే

పండులా ఒంటికి వెళ్లిపోవచ్చు. అంచేత యిప్పుడు మేంఆడికి వెయ్యవద్దు—' అన్నాడు.

కడుపు తరుక్కుపోయింది దుఃఖంతో—

ఏం చెయ్యను ?

మీరంతా ధైర్యం చిక్కబట్టండి—దైవేచ్ఛ యిల్లా ఉంటే తప్పేదేముంది ? నా కూతురికి కన్యాదానం చేసుకునే యోగ్యత నాకు లేకపోయింది. నా చేతులతో చేసిన నీ పెళ్లి అల్లా అయింది. ఇది నేను చెయ్యకపోవడం మంచికే వచ్చిందని సమాధాన పడ్డాను.

పెళ్లి మాత్రం ఆపవద్దు.

మువ్వు ప్రసాదం పీటలమీద కూర్చుని కన్నె ధార పొయ్యండి.

సంతోషంగా గౌరిని అత్తవారింటికి పంపండి—

నాకింక నాలుగు నెల్లల్లో తగ్గిపోతుంది.

రోజు లెల్లకాలం యిల్లాగే ఉండవు. బాగుపడే రోజులు వచ్చినప్పుడు ఈ నిస్పృహ గుర్తుకే రాదు.

నామీద ఒట్టు—పెళ్లి మాత్రం ఆపవద్దు''

కన్నీళ్లతో, నాన్నగారు రాకుండానే కన్యాదానం చేశారు గౌరికి. ఊరంతా విడ్డూరంగా చెప్పుకున్నారు—

ఏణ్ణర్థం తర్వాత తేదీలతో వచ్చిన ఉత్తరాలు—నాన్న గారి మృతికి సంతాపం వెలిబుచ్చుతూ ఆయన స్నేహితులూ చుట్టాలూ రాసినవి.

ఆ ప్రాంతాలలోనే టెలిగ్రాం—

'గోపాలానికి ప్రమాదంగ ఉంది. వెంటనే బయలు దేరండి –'గౌరి బావగారి పేరుతో—

నాన్నగారు పోయి నెల కాలేదు. ఇంతలో ఈ పిడుగు లాటి వార్త ఏమిటని యిల్లంతా గొల్లుమంది. గౌరిని పట్టుకో లేకపోయాం.

మొన్నాడు పొద్దున్నే మళ్లా టెలిగ్రాం వచ్చింది. ప్రమాదమేమీ లేదని.

అయినా గౌరి వెళ్లిపోతానని పట్టుపట్టడంచేత మామయ్యనిచ్చి పంపేశాం.

తరవాత గౌరి రాసిన ఉత్తరం -మామయ్య కథనం వింటే నవ్వాలో, ఏడవాలో అర్థంకా దీనాటికి.

విరహం భరించలేక గౌరిని పిలిపించడానికి గోపాలం బావ వేసిన ఎత్తన్నమాట ఇది !

తరువాతి ఉత్తరాలు చాలావరకు గౌరివి—అక్క డక్కడ పిన్నివి—బాబయ్యవి.

---

బావగారి ప్రమోషన్ -దీపావళికి కొనుక్కున్న చీరా—మైసూర్ వెళ్లడం—మొన్న చూసిన సినిమా—తను అల్లిన స్వెట్టర్లూ—ప్రణయకలహాలు—వీటిని గురించి—

మరో రెండేళ్ల తరువాతి ఉత్తరాల్లో—

మాతృమూర్తి అయిన గౌరి అక్క—పెద్దపిల్ల మణి పసిడి పలుకులు—తడబడే నడకలు—మణి తుమ్మడం——మణికి ఒక డిగ్రీ జ్వరం రావడం—మణి తన్నేపనీ చేసుకోనివ్వక పోవడం—అదివరలో తనకిల్లు క్లీన్‌గా ఉంచాలనే తాపత్రయం, మణి అల్లరి మూలంగా సాగకపోవడం—యిత్యాదులు—

అప్పటినించి అక్కడక్కడ నా ఉత్తరాలు—

యూనివర్సిటీ వాతావరణం –చదువు –పరిస్థితులు—చదివిన కథలు—వక్తలు యిచ్చిన ఉపన్యాసాలు—పరీక్షల నిస్పృహ—చూసిన సినిమాలు.

ఈమధ్య నున్న ఉత్తరాల్లో గౌరి దగ్గర్నించి వచ్చిన వాటిల్లో ఏణ్ణర్థాని కొక పిల్ల చొప్పున పెరగడం—మణి తరవాత రాణి—బాబి—ఇదికాక వాళ్లు బెంగుళూర్ నించి మెడ్రాస్ తరలడం—బావగారు సొంతంగా కంపెనీ పెట్టు కోవడం—

1954—మన ఉత్తరం.

అంటే ఆనర్స్ పరీక్షల ముందు దన్నమాట. అప్పటి నా మనఃస్థితి ఎలా ఉందోనని చదవడం మొదలుపెట్టాను.

''సరళక్కా !

నిన్ను పేరుతో పిలవడం నేర్పిన సుందరమ్మగార్ని ఇతర విషయాలు వదిలేస్తే—అభినందించక తప్పదు. బొడ్డూడని వెధవని నేను నిన్ను సరళా ! అని పిలవడం ఆమె భరించ లేకపోవడం ఎంత ఉపకారం చేసింది ?

ఇప్పటిదాకా చదివి చదివి బోరుకొట్టేసింది. పడు కుందామంటే యిందాకా తాగిన టీ నిద్రాదేవతకూ నాకూ విరోధం కల్పించింది. అయినా గుండెలమీద కుంపటిలా పది హేను రోజులలో పరీక్షలుంటుంటే నిద్రెక్కడ పట్టి చస్తుంది ? పానీయంబులు త్రావుచున్'—' తో లాగ నాకిప్పుడు కనబడేదల్లా ఒక్కటే ! పరీక్షలు.

ఎంత చదివినా ఏమిటో ధైర్యం ఉండడం లేదక్కా ! మూడేళ్ల కోర్సు మూళ్లైళ్లకి సరిపడుతుందేమో వనిపి

స్తుంది. ఎంత చదివినా తరగవు పుస్తకాలు. చదువుతున్నంత సేపూ అంతా తెలిసినట్టే ఉంటుంది. పుస్తకం మూస్తే అంతా అనుమానమే.

పరీక్ష పోతే మూడేళ్ల చదువు వృధా అయిపోతుం దనే బెంగపీడించి కొంత చదువు ఎక్కకుండా చేస్తోంది. కర్మ కాలి ఆ మూడు గంటల్లోనూ తలనెప్పి వచ్చినా చాలు నా ప్రాణానికి.

మన కెంత వచ్చినా ఆ మూడు గంటలలో రాసిన దానిమీదే గదా ఉంటుంది ఫలితం!

కన్ను మూస్తే పీడకల లొస్తున్నాయి. మొన్నొకటి వచ్చింది. ఎంతో బాగా చదివి నాకు బాగా వచ్చిన పేపర్ రాస్తున్నానుట! ఒక్కసారిగా బుర్ర ఖాళీ అయిపోయిందిట! తన్నుకున్నా ఏమీ జ్ఞాపకం రాదుట! అరగంట తరువాత పేపరిచ్చి వెళ్లిపోయానుట! తల్చుకుంటే వణుకోస్తోంది. అటువంటిది జరుగదని నిశ్చయంగా చెప్పలేం—అక్కా— ఆ కలే నిజమైతే—ఇంక నా కాత్మహత్యే శరణ్యం.

రోజూ రాత్రి రెండు మూడూ అవుతూంది పడుకునే సరికి.

బొత్తిగా బోరెత్తిపోతోందని ఇవాళ మధ్యాహ్నం ఒంటి గంట మేటినీకి 'శకుంతల' కి వెళ్లాను. పదేళ్ల క్రితం తీసిన చిత్రం! ఆ రోజుల్లోనే శాంతారాం ఎంత బాగా తీశా డక్కా! మతి పోయింది నాకు.—జయశ్రీ—మొన్న మొన్నటి పర్ఛాయ్‌కీ అప్పటికీ అట్టే తేడా ఏంలేదుస్మా!

ఇంతటి నిరుత్సాహం, నిర్లిప్తతల మధ్య నీ ఉత్తరాలే నాకు అమృతసదృశాలక్కా! గౌరి దగ్గర్నించి ఉత్తరాలు వస్తున్నాయి. మణిని స్కూల్లో జేర్పించారుట. నీకు రాయడ మేమిటి నేను, నా వెర్రిగాని. నీకే ముందర రాయుదూ—గౌరి.

మొన్నటి మా కాలేజీ కథలపోటీలో నాకు మొదటి బహుమతి వచ్చింది. పన్నెండు రూపాయల పుస్తకాలు యిచ్చారు.

అందులో విరాజ్ బహు శరత్‌ది—ఒకటి.

బలహీనత విజృంభించగా—పుస్తకాలు అవతలకు నెట్టేసి అది చదివేశాను. కళ్ల నీళ్లు కాల్వలు కట్టాయి. మా రూంమేట్ అది చూసి అంత బలహీను లేమిటండీ మీరు —పుస్తకం చదివి ఏడుస్తా రేమిటి? అన్నాడు.

నాకూ నిజమే ననిపించింది. అవును, వెధవది పుస్తకం చదివి ఏడవడ మేమిటి? ఇంత బలహీనుణ్ణి నే నింక సాధించే దేమిటి? కాని, మన అనుభూతులను నిగ్రహించే శక్తి మన మనస్సు కెందుకు లేదో?

నువ్వు ఇంగ్లీష్ బాగా అభివృద్ధి చేశావ్? మెట్రిక్ కట్టరా దక్కా. నువ్వు ఎన్నాళ్లనించి పోరుతున్నా నిర్లిప్తంగా ఊరుకుంటావేం? మన చేతులలో లేనివాటిని మనం నిశ్శ బ్దంగా భరించి ఊరుకోవడం తప్ప ఇంకేమీ చెయ్యలేం సరే! కాని మన చేతిలో ఉన్నదాన్ని కూడా ఉదాసీనంగా జార విడుచుకుంటే ఎల్లా? నీ తమ్ముడు యింక కుర్రాడు కాదమ్మా—నిన్ను నా కళ్లల్లో పెట్టుకుని ఆదరిస్తానమ్మా!—

ఇంటి విషయాలు ఎంత వద్దనుకున్నా తలంపుకి రాక తప్పడంలేదు. ఇంక ఆ ధ్యాస వచ్చిందంటే పరీక్షలు కాదు, ఏ భయం చూపెట్టినా, ఏమీ చదవలేక పోతున్నాను."

ఇల్లా ఉంది ఉత్తరం అంతా. ఇప్పుడు తల్చుకుంటే నవ్వు వస్తుంది. కేవలం పరిస్థితులవల్ల మనస్తత్వాలు ఎంతగా మారిపోతాయి?

ఇవాళ నన్నడిగితే ఆనర్స్ పాసవడం అంత సులువు యింకొకటి లేదంటాను. సబ్జెక్ట్సు ఏమీ రాకపోయినా పదేళ్ల పేపర్లు చూసి తరుచు వస్తున్న ప్రశ్నలు కంఠతా పట్టి ముక్కున పెట్టుకువెళ్లి, అక్కడ ఎక్కించి వచ్చేస్తే Class I తప్పదు. వెనకటికి మా రూంమేట్ అనేవాడు— "మనకి అర్థంకావడం ఎందుకండీ! మనం రాసింది దిద్దేవాడి కర్థమైతే చాలు మనం గట్టెక్కడానికి." అది పరమ సత్యం.

పరీక్షల ముందు రివిజన్‌లో మా పిల్లలికి నే నిదే బోధి స్తాను. ఏడాదల్లా కష్టపడి మనం చెప్పింది వీళ్లెలాగూ పట్టించుకోరు. వాళ్లకి కావలసింది పరీక్ష ప్యాసయ్యే మార్గం. ఆఖరిక్షణంలో మనం చెయ్యవలసిందీ అదే అనిపిస్తుంది నాకు.

ఇంకా తిరగేస్తే—గౌరి ఉత్తరాల్లో వాళ్ల కంపెనీ అభివృద్ధిని, వాళ్ల మణికి స్కూల్లో రాంక్‌లు రావడం— వాళ్ల చదువంతా ఇంగ్లీషు మీడియంలోనే సాగడం—తను తమిళం లిపి నేర్చుకుని పుస్తకాలు తెగ చదివెయ్యడం— (గౌరికి మా నాన్నగారి అంశలో భాషలమీది వ్యామోహం వచ్చింది. బెంగుళూరులో కన్నడం తరిచి వదిలిపెట్టింది.)— తరువాత పుట్టిన ఉష, తారలని గురించీ—

ఇంకా తిరగేస్తుంటే మా అనసూయ దస్తూరీ కనబడి ఆగాను. ఏడాది క్రితం ఉత్తరం అది—

"వదినగారికి అనసూయ నమస్కరించి వ్రాసేది:

ఈమధ్య మీ దగ్గర్నించి ఉత్తరాలు బొత్తిగా లేవు. కారణం తెలీదు. మీ తమ్ముడికీ నాకూ పోట్లాట లేని క్షణం

ఉండడంలేదు—మీరొచ్చి ఒక్కసారి వాలుగా ఝూడించక పోతే నా పరువు నిలిచేటట్టు లేదు.

నా కర్మ కాలి ఆయనకా కథల పిచ్చి ఒకటి. రాసినవి సగం తిరిగి వస్తున్నా మానరు. ఆ సగం కూడా పత్రికల వాళ్ళు వేసుకోవడం మానేస్తే బతికిపోదు న్నేను.

ఇవాళ యింట్లో ఒక చిన్న గొడవ జరిగితే దానికి వన్నెలు, చిన్నెలు తగిలించుకుని మరో పక్షానికి ఏ పత్రిక లోనో తయారవుతుంది. ఇల్లూ ఇంటిగుట్టంతా బట్టబయలు చేసుకుంటే నే నెక్కడ చచ్చేది ? తనని ధర్మరాజులా చిత్రించు కుని నన్నో తాటకిలా వర్ణిస్తారు. ప్రతీ కథలోనూ తప్పంతా నాదే అయి, నేను తన్ని క్షమాపణ కోరడం అంతఘట్టం !

మీరన్నా మందలించకపోతే నేను విడాకు లిచ్చేసి మావాళ్లింటికి చక్కా పోతాను.

నెలకో పాతికో పరకో ఎక్కువ రావడం, నా ఖర్చుల నేమీ ఆయన అరికట్టక పోవడం బాగానే ఉన్నాయి కాని—నన్ను వదిలేసి, లోకంలో ఇంకెంతమందో ఉన్నారు, వాళ్ల విరి కించి రాసుకుంటే నాకే అభ్యంతరం లేకపోను.

మొన్న ఎరియర్స్ వస్తే అందులో మూడు వందలు పెట్టి, మీకూ, గౌరి వదినగారికీ, నాకూ మూడు కాశ్మీరు పట్టుచీరలు కొన్నారు. మేం వచ్చేటప్పుడు పట్టుకొస్తాం అవి.

డబ్బు నీళ్లలా వాడే అలవాటూ, స్నేహితులుంటే నన్ను మర్చిపోయే అలవాటూ మాత్రం వదులుకోలేక పోతున్నారు.

రోజూ సాయంత్రం ఇంటి కెవరో తయారౌతుంటారు, ఇంక మిన్ను విరిగి మీద పడ్డా, ఇంట్లో వంటకి సరుకు లున్నా, లేకపోయినా ఆయనకి ఏ పట్టింపు ఉండదు. గట్టిగా అడిగితే ఉపవాసా లుండ మంటారు.

ఉండి దరిద్రం అన్నట్టు ఏమిటీ అవస్థ. అప్పు కెళ్లడం అంటే అసహ్యం నాకు.

అత్తయ్య తన కొడుకు వెన్ననుకున్నా నే నంటే మాత్రం ఓర్చలేరు. ప్రతిదానికీ కొడుకుని వెనకేసు కొస్తుంది.

మొన్న నాకు కోపం వచ్చి "మీరిల్లా ఆయన్ని వెన కేసుకొస్తే యింకీ యింట్లో అన్నం తిన్నామే !" అన్నాను. అంటే ఆవిడ—మీ అమ్మగారు ఏమందో తెలుసా—"పనీ పాటా లేకుండా ఆ అడ్డమైన చెత్త పుస్తకాలూ చదువుతూ కూర్చోకపోతే నువ్వెళ్లి తెచ్చుకోరాదూ ?" అంటూ ఉప న్యాసం మొదలుపెట్టారు. నాకు దుఃఖం ఆగలేదు.

కాని, తప్పేదేముందీ—నెలనెలా సరుకులు తెచ్చు కోవడం ఒక పనై కూర్చుంది.

మీమీద ఎన్నో ఆశలు పెట్టుకుని రాస్తున్నా నిది. తప్పకుండా మీ రాయన్ని నాలుగూ దులిపెయ్యాలి. మీరెన్ని అన్నా పల్లెత్తి మాటాడకుండా అన్నీ మింగేస్తారు గరళ కంఠుడిలా. నేనంటే బొత్తిగా భయంలేకుండా పోయింది.

అందర్నీ పేరు పేరు వరసన అడిగానని చెప్తారుగదూ—

ఇట్లు,
అనసూయ"

నాకు చెమటలు పట్టాయి.

హాసి నీ అసాధ్యం కూలా ! అనుకున్నాను.

తనే ఆట ఆడినా తగ్గ తాళం వేస్తుంటే నా కొచ్చిన లాభం యిదీ ! ఎంతకైనా తగుదురీ ఆడవాళ్ళు.

"ఇల్లిల్లా బార్లాపెట్టి ఎక్కడి కెళ్లావురా ?" అమ్మ కేకతో ఉలిక్కిపడ్డాను.

"నిన్ను నమ్ముకుంటే కుక్క తోక పట్టుకుని గోదావరి యీదినట్టే—ఏ దొంగలో దోచుకుపోయినా దిక్కులేదు గదా—ఏమైంది, తాళంచెవి కనబడిందా ? పన్ను రశీదులు ? గుడ్లు మిటకరిస్తా డేమిటమ్మా — ఈ కాస్త దానికే యిల్లా అయి పోయినవాడివి నువ్విల్లు కట్టించే దేమిటి ?"